

మన్యం కాఫీకి కష్టకాలం!



ఏజెన్సీలో కాఫీ పండ్లు



మన్యంలోని కాఫీ తోటలు

ఈ ఏడాదితో ముగియనున్న రూ.526 కోట్ల కాఫీ ప్రాజెక్టు

- 'కొత్త కాఫీ ప్రాజెక్టు'కు ప్రతిపాదించిన ఐటీడీఏ అధికారులు
- కాఫీ తోటల అభివృద్ధిపై కనీసం స్పందించని వైసీపీ ప్రభుత్వం
- ఏజెన్సీ వ్యాప్తంగా 2 లక్షల 62 వేల ఎకరాల్లో కాఫీ తోటలు
- 2 లక్షల 26 వేల మంది రైతులు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో గిరిజన కాఫీ రైతుల భవితవ్యం అయోమయం

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

ప్రపంచ ఖ్యాతి గడించిన 'మన్యం కాఫీ'కి కష్టాలు తప్పేలా లేవు. ఉపాధి హామీ పథకం సమన్వయంతో రూ.526 కోట్ల వ్యయంతో 2015 నుంచి పదేళ్ల కాల పరిమితితో అమలువుతున్న కాఫీ ప్రాజెక్టు ఈ ఏడాది(2024- 25 ఆర్థిక సంవత్సరం)తో ముగియనుంది. ఈ పరిస్థితులను గుర్తించిన ఐటీడీఏ అధికారులు గత ఏడాదే కొత్తగా మరో కాఫీ ప్రాజెక్టును రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదు.

ఎనిమిదేళ్ల కాల పరిమితితో రూ.వెయ్యి కోట్ల వ్యయంతో లక్ష ఎకరాల్లో కాఫీ తోటలు, మరో 60 వేల ఎకరాల్లో కాఫీకి నీడనిచ్చే మొక్కలను పెంచాలనే లక్ష్యంతో, సుమారుగా లక్షన్నర మంది గిరిజన కాఫీ రైతులకు సంపూర్ణంగా లబ్ధి చేకూరేలా ఐటీడీఏ అధికారులు ప్రణాళిక రూపొందించారు. కొత్త కాఫీ ప్రాజెక్టు ప్రతిపాదనలను ఐటీడీఏ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించి సరిగ్గా ఏడాది కావస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం విశేషం. వాస్తవానికి గిరిజన కాఫీ రైతులకు వైసీపీ ప్రభుత్వం ఎటువంటి ప్రయోజనాన్ని ఈ ఐదేళ్లలో చేకూర్చలేదు. గతంలో మంజూరైన కాఫీ ప్రాజెక్టును మాత్రమే అమలు చేశారు. కొత్తగా గిరిజన కాఫీ రైతులకు ఎటువంటి అదనపు ప్రయోజనం చేకూర్చలేదు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం తరువాత మన్యంలో కాఫీ తోటల అభివృద్ధి, గిరిజన రైతుల భవితవ్యం ఏమిటనేది అయోమయంగా మారింది.

మన్యంలో కాఫీ తోటల అభివృద్ధి క్రమమిది

గిరిజనులు పోడు వ్యవసాయంపై ఆధారపడి అడవులను నాశనం చేయకుండా ఉండేందుకు గానూ 1989లో కాఫీ సాగును ప్రభుత్వం గిరిజనులకు పరిచయం చేసింది. కానీ 2002 వరకు సాధారణంగా కాఫీ తోటల అభివృద్ధి జరగడంతో 1989 నుంచి 2002 వరకు కేవలం 32,072 ఎకరాల్లో మాత్రమే కాఫీ తోటలు అభివృద్ధి జరగ్గా, 2003 నుంచి 2008 వరకు 64,265 ఎకరాల్లో కాఫీ తోటలు వేశారు. ఆ తరువాత 2009లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కాఫీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాయి. దీంతో 2009 నుంచి 2016 వరకు 61,684 ఎకరాల్లో, 2016 నుంచి ఇప్పటి వరకు 84 వేల ఎకరాల్లో కాఫీని అభివృద్ధి చేశారు. ఈ లెక్కన 1989 నుంచి 2024 వరకు ఏజెన్సీ వ్యాప్తంగా 2 లక్షల 62 వేల 21 ఎకరాల్లో కాఫీ తోటలున్నాయి.



విక్రయానికి సిద్ధం చేసిన పార్చిమెంట్ కాఫీ గింజలు

ఆయా తోటల ద్వారా 2 లక్షల 36 వేల 618 మంది గిరిజన కాఫీ రైతులు లబ్ధి పొందుతున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇవి కాకుండా గిరిజన రైతులు స్వయంగా వేసుకున్న సుమారుగా 30 వేల ఎకరాలు కలిపి మొత్తం ఏజెన్సీ వ్యాప్తంగా ప్రస్తుతం 2 లక్షల 92 వేల ఎకరాల్లో కాఫీ తోటలున్నాయి. అయితే వాటిలో సుమారుగా లక్షా 52 వేల ఎకరాల్లో ఏడాదికి 71 వేల టన్నుల కాఫీ పండ్లు దిగుబడి వస్తుందని అంచనా. దీంతో సుమారుగా 14 వేల టన్నుల క్లీన్ కాఫీ గింజలు ఉత్పత్తి అవుతున్నాయి. ఏడాదికి ఒక ఎకరం కాఫీ తోటతో సుమారుగా రూ.40 వేలు నుంచి రూ.50 వేలు ఆదాయం సమకూరుతున్నది. దీంతో కాఫీ తోటల పెంపకంపై గిరిజన రైతులు ఆసక్తి చూపుతున్నారు. అలాగే సేంద్రియ పద్ధతిలో కాఫీ ఉత్పత్తి జరగడంతో ఇక్కడ ఉత్పత్తి చేసే కాఫీ గింజలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లోనూ గిరాకీ ఉంది.

ప్రతిపాదించిన కొత్త కాఫీ ప్రాజెక్టు స్వరూపమిదీ..

ఏజెన్సీలో 2015 ఆర్థిక సంవత్సరం నుంచి పదేళ్ల కాలపరిమితితో అమలవుతున్న కాఫీ ప్రాజెక్టు ఈ ఆర్థిక సంవత్సరంలో ముగిసిపోతుంది. దీంతో భవిష్యత్తులో కాఫీ తోటల అభివృద్ధికి, కొత్త కాఫీ తోటల పెంపకానికి చర్యలు చేపట్టలేని పరిస్థితి. ఏజెన్సీలో అధిక విస్తీర్ణంలో ఉన్న కాఫీని ప్రోత్సహించడంతో పాటు కొత్తగా కాఫీ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించకపోతే భవిష్యత్తులో కాఫీ రైతుల పరిస్థితి అయోమయంగా మారే అవకాశం లేకపోలేదు. దీంతో ఏజెన్సీలో కాఫీ రైతులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని గత ఏడాదే ఐటీడీఏ అప్పటి పీవో రోణంకి గోపాలక్రిష్ణ భావించారు. దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులతో సమీక్షలు జరిపి, ప్రస్తుత కాఫీ ప్రాజెక్టు ముగిసిన తరువాత మరో లక్ష ఎకరాల్లో కాఫీ తోటలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని నిర్ణయించారు. సుమారుగా ఆరు నెలలు శ్రమించి ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులను పరుగులు పెట్టించి, కొత్త కాఫీ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. 2024 నుంచి 2031 వరకు ఏజెన్సీ వ్యాప్తంగా లక్ష ఎకరాల్లో కాఫీ ... మిగతా 4వ పేజీలో



పాడేరులో సోమవారం రాజీనామా పత్రాలను మండల పరిషత్ అధికారికి అందజేస్తున్న వలంటీర్లు

రాజీనామా చేయాలని వలంటీర్లపై ఒత్తిడి

- వైసీపీకి పని చేయాలని అధికార పార్టీకి చెందిన ఐప్యాక్ నుంచి ఆదేశాలు
- అధిక శాతం వలంటీర్లు రాజీనామాలకు దూరం
- టీడీపీ అధికారంలోకి వస్తే వేతనం పెరుగుతుందనే ఉద్దేశంతో వెనకడుగు
- ప్రలోభ పెట్టో, భయపెట్టో ఒప్పించాలని వైసీపీ నేతల విశ్వ ప్రయత్నాలు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

రాజీనామాలు చేసి రానున్న ఎన్నికల్లో వైసీపీ కోసం పని చేయాలని ఏజెన్సీలోని గ్రామ వలంటీర్లపై అధికార పార్టీ నేతలు, గ్రామ వలంటీర్ల సంఘం రాష్ట్ర స్థాయి నేతలతో ఐప్యాక్ ప్రతినిధులు ఒత్తిడి చేస్తున్నారని విశ్వసనీయంగా తెలిసింది. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 352 సచివాలయాల్లో 5,670 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. ఇప్పటికే వారి వద్ద ఉన్న ట్యాబ్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాగా పథకం ప్రకారం తమ పార్టీకి చెందిన వ్యక్తులనే గ్రామ వలంటీర్లుగా అధికార పార్టీ నియమించుకున్న సంగతి తెలిసిందే. అలాగే గ్రామ వలంటీర్లకు క్షేత్ర స్థాయిలో ప్రజలతో నేరుగా సంబంధాలు ఉండడంతో పాటు పథకాల లబ్ధిదారులను సైతం వారి గుప్పిట్లో పెట్టుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో వలంటీర్లను వినియోగించుకుని ఎన్నికల్లో లబ్ధి పొందాలనే లక్ష్యంతో ఇప్పటికే తమకు అనుకూలంగా వున్న పలువురు వలంటీర్లతో ఐప్యాక్ టీమ్ సమావేశాలు నిర్వహించింది. వలంటీర్లంతా విధిగా రాజీనామాలు చేసి, రానున్న ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పని చేయాలని రాష్ట్ర స్థాయిలో ఉండే వలంటీర్ల సంఘం నేతలతో ఐప్యాక్ ప్రతినిధులు ఒత్తిడి చేయిస్తున్నారు. దీంతో సోమవారం ఏజెన్సీలో పాడేరు, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాలకు చెందిన 250 మంది రాజీనామాలు చేశారు. ఇదే అదనుగా మొత్తం వలంటీర్లను రాజీనామా చేయించాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

రాజీనామాలకు కొందరు ససేమిరా

అధికార పార్టీ ఎన్ని ఒత్తిళ్లు చేసినా అధిక శాతం వలంటీర్లు రాజీనామాలు చేసేందుకు అంగీకరించడం లేదు. భవిష్యత్తులో టీడీపీ అధికారంలోకి వస్తే నెల వేతనం పెరగడంతో పాటు మరింత ఆదాయం వస్తుందనే ఆశతో వీరంతా ఉన్నారు. దీంతో ఎక్కువ మంది వలంటీర్లు తాము రాజీనామాలు చేయబోమని తెగేసి చెబుతుండడంతో ఐప్యాక్ బృందం తల పట్టుకుంటున్నది. అయినప్పటికీ ఏదో మార్గంలో ప్రలోభ పెట్టో, భయపెట్టో వలంటీర్లను రాజీనామా చేయించి ఎన్నికల్లో తమకు అనుకూలంగా వాడుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే తక్కువ శాతం మంది వలంటీర్లు మాత్రమే వైసీపీకి అనుకూలంగా ఉండడం గమనార్హం.



ఎండ ప్రభావానికి మంగళవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న పాడేరు అంబేడ్కర్ సెంటర్

బాబోయ్ ఎండలు

కొయ్యూరులో అత్యధికంగా 41.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

పాడేరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మన్యంలోనూ భానుడు ప్రతాపం చూపుతున్నాడు. వేసవి నేపథ్యంలో ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లోనూ మార్పు చోటు చేసుకుంటున్నది. కొయ్యూరులో మంగళవారం 41.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఒక మాదిరిగా ఎండలు ఉండే ఏజెన్సీలో సైతం ఉదయం నుంచే ఎండ ప్రభావం ప్రారంభమవుతున్నది. మధ్యాహ్నం వేళల్లో ఎండ ధాటికి రోడ్లపై జనం సంచరించేందుకు సాహసించలేకపోతున్నారు. సాయంత్రం ఆరు గంటల తరువాత నుంచి ఎండ ప్రభావం తగ్గుతున్నప్పటికీ ఉక్కపోత, వేడి వాతావరణం మాత్రం కొనసాగుతున్నది. కాగా మంగళవారం కొయ్యూరులో 41.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు అయింది. అనంతగిరిలో 36.1, అరకులోయలో 35.8, చింతపల్లిలో 38.8, డుంబ్రిగుడలో 36.8, జీకేవీధిలో 39.9, జి.మాడుగులలో 38.0, హుకుంపేటలో 36.3, ముంచంగిపుట్టులో 37.0, పాడేరులో 37.7, పెదబయలులో 37.0 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



నిర్మానుష్యంగా ఉన్న కొయ్యూరు ప్రధాన రహదారి

కొయ్యూరులో వడగాడ్పులు

కొయ్యూరు: మండల కేంద్రంలో ఎండల తీవ్రత కొనసాగుతున్నది. కొయ్యూరులో మంగళవారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదుకావడంతో నిప్పుల కొలిమిలా మారింది. ఎండకు తోడు ఉక్కపోత, వేడి వాతావరణం వల్ల జనం అల్లాడిపోతున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటినా వేడి గాలులు తగ్గడం లేదు. వడగాడ్పుల ప్రభావానికి మామిడి పిందెలు నేలరాలుతున్నాయి. ఉదయం 11 గంటలు దాటితే రహదారులు ... మిగతా 4వ పేజీలో

అరకులోయలో బీజేపీ రోడ్ షో

అరకులోయలో బీజేపీ అరకు ఎంపీ అభ్యర్థిని కొత్తపల్లి గీత, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి పాంగి రాజారావు మంగళవారం రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షో అరకులోయ పబ్లిక్ స్కూల్ నుంచి యండపల్లివలస, అరకు, జైపూర్ జంక్షన్ వరకు సాగింది. వీరికి బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.
-వార్త 4వ పేజీలో..



అరకులోయలో బీజేపీ ఎంపీ అభ్యర్థిని కొత్తపల్లి గీత, ఎమ్మెల్యే అభ్యర్థి పాంగి రాజారావుకు ఘన స్వాగతం పలుకుతున్న కూటమి శ్రేణులు

ముత్యాలమ్మ జాతర జరిగేనా?

- ఉత్సవాల నిర్వహణకు అడ్డంకిగా మారిన ఎన్నికల కోడ్
- వినోద కార్యక్రమాలకు అనుమతి నిరాకరించిన పోలీసులు

చింతపల్లి, ఏప్రిల్ 16: గిరిజన ప్రాంత ప్రజల ఆరాధ్య దైవమైన ముత్యాలమ్మ జాతర నిర్వహణకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఉత్సవాలు నిర్వహించేందుకు అధికారులు, పోలీసుల నుంచి అనుమతులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో జాతర జరుగుతుందా?, లేదా అనే సందేహం భక్తుల్లో కనిపిస్తున్నది. ఉత్సవ కమిటీ సభ్యులు సైతం జాతర నిర్వహణపై ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. మంగళవారం ఉత్సవ కమిటీ సభ్యులు స్థానిక అదనపు ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్‌తో జరిపిన చర్చల్లో వినోద కార్యక్రమాలకు అనుమతించలేమని ఆయన స్పష్టం చేశారు. చింతపల్లి ముత్యాలమ్మ జాతర ప్రతి ఏడాది గంధామావాస్యకు ముందు నాలుగు రోజులు నిర్వహించడం ఆనవాయితీగా ... మిగతా 4వ పేజీలో



ముత్యాలమ్మ అమ్మవారు



మంగళవారం ఏఎస్పీ ప్రతాప్ శివ కిశోర్‌తో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

18 నుంచి నామినేషన్ల స్వీకరణ

పాడేరు అసెంబ్లీ ఆర్‌వో, జేసీ భావన వశిష్ఠ 4

స్ఫూర్తిదాయకం హనిత విజయం

- సివిల్స్‌లో సత్తా చాటిన నగరానికి చెందిన వేములపాటి హనిత
- 887 ర్యాంకు సాధన..
- అరుదైన వ్యాధితో పదేళ్లుగా వీల్ చైర్‌కే పరిమితం
- దూరవిద్యలో డిగ్రీ, ఆపై సివిల్స్‌పై గురి
- నాలుగో ప్రయత్నంలో విజయం
- కష్టపడితేనే విజయం సాధ్యం



హనిత

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆమె చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండేది. ఆ ప్రతిభే ఐఐటీలో ఇంజనీరింగ్ సీటు తెచ్చిపెట్టింది. అయితే అదే సమయంలో అనారోగ్యం బారినపడడంతో బీటెక్ పూర్తిచేయలేకపోయింది. ఊహించని పరిణామంతో రెండేళ్లు మానసికంగా కుంగిపోయింది. కానీ తల్లిదండ్రులు, సన్నిహితుల ప్రోత్సాహంతో దూరవిద్యలో డిగ్రీ పూర్తిచేసింది. ఆ తరువాత సివిల్స్ లక్ష్యంగా పెట్టుకుని, నాలుగో విడతలో సాధించింది.

యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్-2023 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో నగర పరిధిలోని కిర్లంపూడి లేఅవుట్ ప్రాంతానికి చెందిన వేములపాటి హనిత 887 ర్యాంకు సాధించారు. మూడుసార్లు మెయిన్స్ వరకే పరిమితమైన హనిత...పట్టువిడవక నాలుగో ప్రయత్నంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడిన ...మిగతా 4వ పేజీలో

బాబోయ్ ఎండలు

... 3వ పేజీ తరువాయి

నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

డుంబ్రిగుడ: మండలంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గిరిజనులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. డుంబ్రిగుడ, కించుమండ, అరకు ప్రధాన రహదారులు మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారాయి.

పెదబయలు: మండలంలో ఎండ తీవ్రత అధికంగా ఉంది. మంగళవారం మధ్యాహ్నం పెదబయలులోని రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. వడగాడ్పులు తీవ్రంగా వీయడంతో జనం బయటకు రావడానికి సాహసించలేదు.

మన్యం కాఫీకి కష్టకాలం!

... 3వ పేజీ తరువాయి

తోటలు, మరో 60 వేల ఎకరాల్లో కాఫీ మొక్కలకు నీడ నిచ్చే మొక్కల పెంపకానికి ప్రణాళికలు తయారు చేశారు. 2024- 25లో 15 వేల ఎకరాల్లో నీడ మొక్కలు, 10 వేల ఎకరాల్లో కాఫీ మొక్కలు, 2025- 26లో 15 వేల ఎకరాల్లో నీడ మొక్కలు, 10 వేల ఎకరాల్లో కాఫీ మొక్కలు, 2026- 27లో 15 వేల ఎకరాల్లో నీడ మొక్కలు, 10 వేల ఎకరాల్లో కాఫీ మొక్కలు, 2027- 28లో 15 వేల ఎకరాల్లో నీడ మొక్కలు, 10 వేల ఎకరాల్లో కాఫీ మొక్కలు, 2028- 29లో 20 వేల ఎకరాల్లో కాఫీ మొక్కలు, 2029- 30లో 20 వేల ఎకరాల్లో కాఫీ మొక్కలు, 2030- 31లో 20 వేల ఎకరాల్లో కాఫీ మొక్కల పెంపకాన్ని చేపడతారు. దీని వల్ల ప్రత్యక్షంగా లక్షన్నర మంది గిరిజన కాఫీ రైతులకు లబ్ధి చేకూరుతుంది. అలాగే కాఫీ రైతులకు అవసరమైన డ్రైయింగ్ ప్లాట్‌ఫారాలు, నిచ్చెనలు, మినీ పల్పింగ్ యంత్రాలు, తదితరాలను అందిస్తారు. బదిలీ కావడానికి వారం ముందే రోణంకి గోపాలక్రిష్ణ, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే అనుమతితో కొత్త కాఫీ ప్రాజెక్టుపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. అలాగే మొత్తం రూ.వెయ్యి కోట్ల ఈ ప్రాజెక్టులో రూ.800 కోట్లు ట్రైబల్ సబ్ ప్లాన్ నుంచి, మరో రూ.200 కోట్లు కేంద్ర కాఫీ బోర్డు నుంచి అందించేలా ప్రణాళికలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో కొత్త కాఫీ ప్రాజెక్టును మంజూరు చేస్తే మరో పదేళ్ల మన్యంలో కాఫీ రైతులకు మేలు జరుగుతుందని అందరూ భావించారు. అయితే ప్రభుత్వం నుంచి దీనిపై ఎటువంటి స్పందన లేకపోవడంతో మన్యంలో కాఫీ తోటల అభివృద్ధి ఏమిటనే దానిపై ప్రస్తుతం ఐటీడీఏ, కాఫీ బోర్డు అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ముత్యాలమ్మ జాతర జరిగేనా?

... 3 వ పేజీ తరువాయి

వస్తున్నది. ఈ ఏడాది గంధామావాస్య మే 8న వచ్చింది. దీంతో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి జాతరను మే 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జాతర నిర్వహణకు పలు చిక్కుముడులు ఎదురవుతున్నాయి. ముత్యాలమ్మ జాతర గంధామావాస్యకు ముందు మాత్రమే నిర్వహించాలనేది భక్తుల విశ్వాసం. దీంతో తేదీలను మార్చుకునే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఎలాగైన జాతరను నిర్వహించాలని ఉత్సవ కమిటీ ప్రయత్నిస్తున్నప్పటికి అధికారుల నుంచి అనుమతులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

సాంస్కృతి కార్యక్రమాలకు బ్రేక్

చింతపల్లి ముత్యాలమ్మ జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యే స్థానం ఉన్నది. ప్రతి ఏడాది మూడు వేదికల్లో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. అయితే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే వేదికలు ప్రభుత్వానికి చెందినవి కావడంతో అధికారులు అనుమతించేది లేదని తేల్చి చెప్పేశారు. డిగ్రీ కళాశాల, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆర్ అండ్ బీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికల్లో ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించరాదని చింతపల్లి అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ తేల్చి చెప్పేశారు. దీంతో జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుకు దాదాపు బ్రేక్ పడింది.

బందోబస్తు కల్పించలేం

ముత్యాలమ్మ జాతరకు బందోబస్తు కల్పించలేమని పోలీసులు స్పష్టం చేశారు. మంగళవారం ఉత్సవ కమిటీ సభ్యులు స్థానిక అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్‌ని కలిశారు. ముత్యాలమ్మ జాతరకు లక్షల్లో భక్తులు వస్తారని, ప్రస్తుతం పోలీసులు ఎన్నికల విధుల్లో ఉండడం వల్ల జాతరకు బందోబస్తు కల్పించలేమన్నారు. ప్రతి ఏడాది జాతర కోసం ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యంకాదన్నారు. అమ్మవారి ఆలయంలో సాధారణ పూజలు, ఊరేగింపులకు అనుమతిస్తామని, ఇతర వినోద కార్యక్రమాలకు అనుమతించలేమని చెప్పారు. ఉత్సవ కమిటీ అభ్యర్థన మేరకు జిల్లా ఎస్పీతో చర్చించి సాధ్యాసాధ్యాలు తెలియజేస్తామని ఆయన వెల్లడించారు.

కూటమి గెలుపుతోనే రాష్ట్రానికి మంచిరోజులు

- జగన్ అసమర్థ పాలనతో ఆంధ్ర అప్పులమయం
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక పెరిగిన నిరుద్యోగ సమస్య
- ప్రజలందరి కష్టాలు తీరాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి, మోదీ మరోసారి ప్రధాని మంత్రి కావాలి
- అరకు పార్లమెంటు బీజేపీ అభ్యర్థిని కొత్తపల్లి గీత వెల్లడి
- అరకు పట్టణంలో భారీ ఎత్తున రోడ్డుషో


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థిని కొత్తపల్లి గీత, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి పాంగి రాజారావు, కిడారి శ్రావణ్‌కుమార్ తదితరులు



రోడ్డు షోలో ప్రజలకు పార్టీ గుర్తు చూపుతున్న కొత్తపల్లి గీత

అరకులోయ, ఏప్రిల్ 16 : ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల రాష్ట్రంగా, గంజాయికి కేరాఫ్ అడ్రస్‌గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చేశారని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అరకు పార్లమెంటు అభ్యర్థిని కొత్తపల్లి గీత ఆరోపించారు. అరకులోయలో మంగళవారం ఆమె అరకు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి పాంగి రాజారావుతో కలిసి రోడ్డు షో నిర్వహించారు. అరకులోయ పబ్లిక్ స్కూల్ నుంచి ప్రారంభమైన ఈ రోడ్డుషో బాజాభజంత్రీలు, థింసా నృత్యాల నడుమ పట్టణం మీదుగా యండపల్లివలస, అరకు- జైపూర్ జంక్షన్ వరకు సాగింది ఈ సందర్భంగా పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి జంక్షన్ సమీపంలోని ప్రైవేటు రిసార్ట్ ప్రాంగణంలో గీత విలేకరులతో మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ఆరోపించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అసమర్థ పాలన కారణంగా రాష్ట్రాభివృద్ధి కుంటుపడడంతో పాటు అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. మరోవైపు గిరిజన ప్రాంత నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పలేదని దుస్థితి నెలకొందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన లేకపోవడంతో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందన్నారు. ఇలాంటి అసమర్థులను ఇంటికి సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను అంతా గెలిపించాల్సిందిగా ఆమె కోరారు. గతంలో తాను అరకు ఎంపీగా ఉన్నపుడు చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఆరోగ్యపరంగా ఆస్పత్రులకు 27 అంబులెన్స్‌లను ఇచ్చామన్నారు. విశాఖపట్నం నుంచి కిరండోల్ వరకు విస్టోడమ్ కోచ్ (అద్దాల కోచ్‌లను) మంజూరు చేసినట్టు చెప్పారు. పీఎంజీఎస్‌వై పథకం కింద మారుమూల గ్రామాలకు సైతం పక్కా తారు రోడ్లు నిర్మించామన్నారు. ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేసినట్టు చెప్పారు. రాష్ట్రం, దేశం ప్రగతి పథాన నడిపే సమర్థులు చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా, నరేంద్రమోదీని మళ్లీ ప్రధాన మంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రోడ్డు షోలో అరకు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్, జనసేన పార్టీ అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి చిరంజీవి , బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల సీనియర్ నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు : కలెక్టర్


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ విజయసునీత

రంపచోడవరం, ఏప్రిల్ 16 : సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఎం.విజయ సునీత తెలిపారు. ఇక్కడి స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ నిర్వహించే హాలు, స్ట్రాంగ్‌రూమ్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ తదితర ప్రదేశాలను సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తహసీల్దార్లు ఎ.కృష్ణజ్యోతి, నాగరాజు, డీటీలు సత్యనారాయణ, చైతన్య, శ్రీధర్, విశ్వనాథం, శివ, సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ మోహన్‌రావు పాల్గొన్నారు.

దళారుల బారినుంచి జీడిమామిడి రైతులను కాపాడాలి

కొయ్యూరు, ఏప్రిల్ 16 : జీడిమామిడి ఫలసాయానికి గిట్టుబాటు ధర కల్పించి, ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేయకపోవడంతో సదరు రైతులు దళారుల చేతిలో నష్టపోతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నయ్య పడాల్ వాపోయారు. మండలంలోని చీడిపాలెంలో మంగళవారం మండల కార్యదర్శి ఎస్. సూరిబాబు అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. కొయ్యూరు, ముంచింగిపుట్టు, అనంతగిరి మండలాల్లో జీడిమామిడి రైతులు గిట్టుబాటు ధర కోసం పోరాటం చేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యార న్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో పిక్కలు ధర రూ.150 దాటిఉండగా, ప్రస్తుతం 80కిలోల జీడిమామిడి పిక్కలబస్తా దళారులు రూ.ఎనిమిది వేలకు కొనుగోలు చేస్తున్నారన్నారు. పార్టీ నాయకులు రమణ, చిట్టిబాబు, చిట్టిపాప, భాస్కర్, పెంటయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి శాశ్వత విద్యా నంబర్

- జిల్లా విద్యా శాఖాధికారి బ్రహ్మాజీరావు

పాడేరు రూరల్, ఏప్రిల్ 16 : పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి శాశ్వత విద్యా నంబర్ ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఇందుకు సంబంధించి ఎంఈవోలు, ఆయా హెచ్‌ఎంలకు ఉత్తర్వులు పంపించామన్నారు. ఒకటో తరగతి అడ్మిషన్ సమయంలో విద్యార్థికి కేటాయించిన సంఖ్య వారి చదువు పూర్తయ్యేంత వరకు అలాగే ఉంటుందన్నారు. భారత ప్రభుత్వ యూడీఐఎస్‌ఈని పోస్టల్ ద్వారా అందిస్తుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి అడ్మిషన్ పొందిన విద్యార్థులకు మినహా మిగిలిన వారందరికీ పెన్ తప్పని సరిగా చేయాలని ఆదేశించామన్నారు. ప్రతి విద్యా సంవత్సరంలో విద్యార్థులను పై తరగతులకు ప్రమోట్ చేయడం, ఇతర పాఠశాలలకు బదిలీ చేసేందుకు రికార్డు షీట్, టీసీ, కుల, జనన ధ్రువీకరణ పత్రాలు వంటి వాటి కోసం పట్టుబట్టకుండా అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలకు విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని ఆదేశించినట్టు చెప్పారు. ఆన్‌లైన్ టీసీ సౌకర్యం ఉన్నప్పటికీ కొన్ని పాఠశాలల్లో పాత విధానాన్నే అనుసరిస్తుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి అటువంటి సమస్యలను అధిగమించేందుకు, కొత్త తరహాలో విద్యార్థుల బదిలీ ప్రక్రియ సులభతరం చేయడానికి ట్యాగింగ్ చేశామన్నారు.

ఎస్.కొత్తూరులో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

జి.మాడుగుల, ఏప్రిల్ 16 : సొలభం పంచాయతీ ఎస్.కొత్తూరులో మంగళవారం సీతారాముల విగ్రహాలను మంగళవారం ప్రతిష్ఠించారు. తొలుత విశాఖకు చెందిన మత్స్య సుబ్రహ్మణ్యం వేదపండితులచే విశేష పూజలు నిర్వహించారు. ఏయూ ప్రొఫెసర్ ఎం.గీతామధవబాబు విగ్రహాన్ని వితరణగా అందజేశారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మలేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు

జి.మాడుగుల, ఏప్రిల్ 16 : మలేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలుగా గ్రామాల్లో స్ప్రేయింగ్ చేస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవిచంద్రశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా పీహెచ్‌సీలో మంగళవారం స్ప్రేయింగ్ చేయించారు. తొమ్మిది సచివాయాల పరిధి 57 గ్రామాలకు ఈ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా గత ఏడాది మలేరియా ప్రబలిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ టి.శశికాంత్, సిబ్బంది ఎన్.ప్రకాశ్, ఆర్.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

తిగలవలసలో ఉచిత వైద్య శిబిరం

హుకుంపేట ఏప్రిల్ 16 : తిగలవలసలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సౌమ్య ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో రోగులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. వేసవి కాలంలో ఆరోగ్య పరిరక్షణకు వైద్య సిబ్బంది సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి ప్రియాంక, శ్రీదేవి, ప్రవీణ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 16 : సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలని డీసీహెచ్‌వో డాక్టర్ కృష్ణారావు సూచించారు. మండలంలోని జోలాపుట్టులో మంగళవారం లబ్బూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్యామ్‌ప్రసాద్, సంతోష్ పాల్గొన్నారు.

'సాంకేతిక రంగంలోనూ రాణించాలి'

పాడేరు రూరల్, ఏప్రిల్ 16: గిరిజన విద్యార్థులు సాంకేతిక రంగంలోనూ రాణిం చాలని పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్, కెరియర్స్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. పీజీసెట్, ఎడ్‌సెట్, రైల్వే, బ్యాంకింగ్, ఏపీపీఎస్సీ, యూపీఎస్సీ పోటీ పరీక్షలకు ఏవిధంగా ప్రిపేర్ కావాల్లో అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ టీఎస్ రసూల్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, అధ్యాపకులు రమేష్‌బాబు, గౌరీశంకరరావు, దామోదర్, సౌజన్య, గణేష్ పాల్గొన్నారు.

స్లాస్ పరీక్షల తీరు పరిశీలన


: పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న డీఈవో

పాడేరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పాడేరులో మంగళవారం నిర్వహించిన స్లాస్(స్టేట్ లెవల్ అసెస్‌మెంట్ సర్వే) పరీక్షల తీరును జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు పరిశీలించారు. విద్యార్థుల్లో అభ్యాసనా పటిమను వెలికితీసేందుకు నిర్వహించే పరీక్షను మంగళవారం ఎంపిక చేసిన విద్యార్థులకు నిర్వహించారు. దీంతో పరీక్షలు జరుగుతున్న తీరును మండల విద్యాశాఖాధికారి ఎస్.రామచంద్రరావుతో కలిసి డీఈవో బ్రహ్మాజీరావు పరిశీలించారు.

15 మంది వలంటీర్లు రాజీనామా

జి.మాడుగుల, ఏప్రిల్ 16 : మండల వ్యాప్తంగా పదిహేను మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ల సంఘం నాయకులు రాంబాబు, లక్ష్మణపడాల్, కొండబాబు, శోభన్ రాంబాబు, మహేశ్, పేతురు బాబు తదితరులు పాల్గొన్నారు.

రేవళ్ళులో జీడిమామిడి తోట దగ్ధం

కొయ్యూరు, ఏప్రిల్ 16 : మండలంలోని రేవళ్ళ గ్రామానికి చెందిన ఇమ్మిడి రాంబాబుకు చెందిన సుమారు నాలుగు ఎకరాల జీడిమమిడి తోట సోమవారం సాయంత్రం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.మూడు లక్షల మేర నష్టం సంభవించింది. ఫల సాయం చేతికి అందే సమయంలో ప్రమాదంలో తోట కాలిపోవడంపై బాధిత కుటుంబం రోదిస్తోంది. జరిగిన నష్టాన్ని అంచనా వేసి తగిన విధంగా ప్రభుత్వం ఆదుకోవాలని వారంతా కోరుతున్నారు.

కూటమి అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

కొయ్యూరు, ఏప్రిల్ 16 : ఎన్నికల్లో కూటమి అభ్యర్థి కిల్లు వెంకట రమేష్ నాయుడును గెలిపించి, ఈ ప్రాంత అభి వృద్ధికి అంతా సహకరించాల్సిందిగా టీడీపీ మండల అధ్యక్షుడు జి.సత్యనారాయణ కోరారు. మండలంలోని నడింపాలెం, బట్టపణుకులు, శరభన్నపాలెం పంచాయతీల్లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నాయకులు ఇరవాడ సత్తిబాబు, పనసల ఇందిర దేవి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అరికట్టాలని వినతి

డుంబ్రిగుడ, ఏప్రిల్ 16 : మండలంలోని అరుకు పంచాయతీలో అక్రమ నిర్మాణాలను అరికట్టాలని వార్డు సభ్యుడు భవానీశంకర్‌తో పాటు పలువురు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఏజెన్సీలో 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ పంచాయతీలో అక్రమ కట్టడాలను నిర్మిస్తున్న గిరిజనేతరులు, అందుకు సహకారం అందిస్తున్న అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు.

ఒకటిన మల్లమ్మతల్లి జాతర

డుంబ్రిగుడ, ఏప్రిల్ 16 : సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో వచ్చే నెల ఒకటో తేదీన మల్లమ్మతల్లి గృహ జాతర జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధి బురిడి మోహన్‌రావు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

'హోం ఓటింగ్ కల్పనకు చర్యలు'

చింతపల్లి, ఏప్రిల్ 16 : కదలలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వృద్ధులకు హోం ఓటింగ్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌వోలు, సెక్టోరల్ అధికారులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ బూత్‌కి చేరుకోలేని దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే ఈవీఎం మిషన్ పంపించడం జరుగుతుందన్నారు.

చింతపల్లిలో ట్యాంకర్లతో నీటి సరఫరా

చింతపల్లి, ఏప్రిల్ 16 : మండల కేంద్రం చింతపల్లిలో పంచాయతీ, ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులు ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. సీపీడబ్ల్యూ పథకం కుళాయిల ద్వారా నీటి సరఫరా జరగడంలేదు. పథకం ట్యాంకర్లను నింపే బావులు అడు గంటిపోయాయి. ప్రత్యామ్నాయ మార్గంలేక చిన్నగెడ్డ, అంతర్ల గ్రామాల నుంచి ట్యాంకర్లతో నీళ్లను తీసుకొచ్చి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ గడుతూరి స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి కొరుప్రోలు శ్రీనివాసరావు తదితరులు పలు వీధుల్లో అందిస్తున్నారు.

18 నుంచి నామినేషన్ల స్వీకరణ

- పాడేరు అసెంబ్లీ ఆర్‌వో, జేసీ భావన వశిష్ఠ


రాజకీయ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్‌వో భావన వశిష్ఠ

పాడేరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు అసెంబ్లీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాలను గురువారం నుంచి స్వీకరిస్తామని స్థానిక అసెంబ్లీ స్థానం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి ఈ నెల 18 నుంచి 24 తేదీ వరకు స్వీకరిస్తామని, 26న నామినేషన్ల పరిశీలన, 29 నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. అలాగే నామినేషన్ల నేపథ్యంలో అభ్యర్థులు చేపట్టాల్సిన చర్యలు, పాటించాల్సిన నిబంధనలను ఆమె వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్‌కు రూ.10 వేలు డిపాజిట్ చేయాలని, ఎస్టీ అభ్యర్థులు అందులో సగం చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటిస్తూ పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని భావన వశిష్ఠ కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి కల్యాణ చక్రవర్తి, వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

అరకులో స్ట్రాంగ్ రూమ్ పరిశీలన


స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతను పరిశీలిస్తున్న ఆర్‌వో

అరకులోయ, ఏప్రిల్ 16 : ఈవీఎంలు ఆయా నియోజకవర్గాలకు పగడ్బందీ ఏర్పాట్ల నడుమ చేరాయని అరకు అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్, ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలని స్ట్రాంగ్ రూమ్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌గా ఉన్న తహసీల్దార్ కార్యాలయం, ప్రాంగణంలో ఉన్న కార్యాలయాల వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటుపై పలు సూచనలు చేశారు. అధికారులంతా సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఏవో సోమేశ్వరరావు, టీడబ్ల్యూ ఏఈఈ అభిషేక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలు నివారణ'

పాడేరు రూరల్, ఏప్రిల్ 16 : అగ్ని ప్రమాదాల సమయంలో ఏవిధంగా అప్రమత్తం కావాలన్న దానిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పాడేరు అగ్నిమాపక కేంద్రం అధికారి కె.పెంటయ్య నాయుడు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని కుమ్మరిపుట్టు గ్రామంలో వంట గ్యాస్ వినియోగించే సమయంలో అకస్మికంగా వచ్చే మంటలు.. ఆ సమయంలో ఎలా వ్యవహరించాలి తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎల్.బాలకృష్ణ, ఎల్.చంద్రశేఖర్, వెంకటేష్, శివాజీరాజు, పరమేశ్వరరావు, హేమంత్, రవిరాజు, కొండలరావు, రాము, గిరీష్, శివయ్య, త్రినాథ్, రాంబాబు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం హనిత విజయం

... 3వ పేజీ తరువాయి

హనిత సివిల్స్ బాట పట్టడానికి గల కారణాలు, ఆ ప్రయత్నంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, అధిగమించేందుకు పడిన శ్రమ వంటి వాటిని వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...


అనుకోకుండా సివిల్స్ వైపు ప్రయాణం..

అమ్మ ఇందిర ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. నాన్న వేములపాటి రాఘవేంద్రరావు ఇండియన్ రైల్వేలో సీనియర్ ఇన్‌స్పెక్టర్. ప్రాథమిక విద్యాభ్యాసం ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు టింపనీలో సాగింది. ఇంటర్మీడియట్ ఫిడ్జ్‌లో పూర్తిచేశా. ఇంటర్ తరువాత ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్‌లో చేరా. అయితే, ఆ సమయంలో అనారోగ్యం బారినపడడంతో బీటెక్ పూర్తిచేయలేకపోయా. 2013లో అత్యంత అరుదుగా కనిపించే వెన్నముక ఇన్‌ఫెక్షన్ బారినపడ్డా. ఆ ఇన్‌ఫెక్షన్ వల్ల నాలుగు గంటల్లోనే పెరాలసిస్ వచ్చింది. కాళ్లు పూర్తిగా చచ్చుబడిపోయాయి. అనేక ఆస్పత్రులకు తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో రెండేళ్లపాటు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. తల్లిదండ్రులు సహకారం, గురువు రామదూతస్వామి ప్రోత్సాహం, ఆశీస్సులతో మళ్లీ సాధారణ స్థితికి రాగలిగాను. ఆయన సూచనతోనే దూరవిద్యలో డిగ్రీ పూర్తిచేశాను. ఆ తరువాత సివిల్స్ దిశగా ప్రయాణం ప్రారంభించా. 2020లో తొలిసారి అటెమ్ట్ చేశా. మూడు ప్రయత్నాల్లో ప్రిలిమ్స్ క్లియర్ చేశా. మెయిన్స్‌లో విఫలమయ్యాను. నాలుగో ప్రయత్నంలో మెయిన్స్, ఇంటర్వ్యూ క్లియర్ చేయడంతోపాటు మంచి ర్యాంకు సాధించాను. ఈ ర్యాంకు సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. గత ఏడాది గ్రూప్-1 కూడా అటెమ్ట్ చేశాను. ఏవో ఉద్యోగానికి ఎంపికయ్యాను. ప్రస్తుతం నగర పరిధిలోని మానసిక ఆస్పత్రిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను. ఇక్కడ పనిచేస్తుండగానే సివిల్స్ ర్యాంకు వచ్చింది.

ఇంట్లో ప్రిపరేషన్

సివిల్స్ ప్రిలిమ్స్‌కు ఇంట్లోనే ప్రిపేరయ్యాను. మెటీరియల్ సొంతంగా తయారు చేసుకున్నాను. మెయిన్స్‌కు మాత్రం సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీతోపాటు పలుచోట్ల తీసుకున్న శిక్షణ, గైడెన్స్ ఎంతగానో ఉపకరించాయి. మొదట్లో ప్రతి రోజూ ఎనిమిది గంటలు చదవడానికి కేటాయించేదాన్ని. ఆ తరువాత క్రమంగా ఆరు గంటలు సమయాన్ని కేటాయించాను. గైడెన్స్ లేకపోవడంతో తొలి మూడు ప్రయత్నాల్లో విఫలమయ్యాను. మూడుసార్లు ఎక్కడెక్కడ లోపాలు ఉన్నాయో వాటిని సరిదిద్దుకుని నాలుగో ప్రయత్నంలో విజయం సాధించాను. ఇందుకు ఫ్యాకల్టీ, తల్లిదండ్రులు అందించిన సహకారం చాలా గొప్పది.

జిల్లా విద్యాశాఖ ఏడీపై ఫిర్యాదు


డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న డీటీఎఫ్ నాయకులు

పాడేరురూరల్, ఏప్రిల్ 16: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సర్వీస్ ఏడీ-1 (అసిస్టెంట్ డైరెక్టర్)గా విధులు నిర్వహిస్తున్న వినయ్‌మోహన్ అవినీతి అక్రమాలపై కఠిన చర్యలు చేపట్టాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు ముఖి రామకృష్ణ ఆధ్వర్యంలో సంఘం నాయకులు డీఈవో పి.బ్రహ్మాజీరావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఏడీ-1 వినయ్‌మోహన్ విధి నిర్వాహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్, ఏపీటీఎఫ్, ఎస్టీయూ, యూటీఎఫ్, పీఆర్‌టీయూ, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు గెమ్మెలి వికాష్, మినుముల ప్రసాద్, బి.సోంబాబు, ఎస్.శేషగిరిరావు, జి.వరలక్ష్మీ, ఎస్.గంగాధర్, ఎం.శ్రీను, కె.మోహన్‌రావు, ముఖి శేషాద్రి, బి.సింహాచలం పాల్గొన్నారు.

క్రైం... crime news

207 కిలోల గంజాయి స్వాధీనం

» ఇద్దరి అరెస్టు, పరారీలో మరో ఇద్దరు


స్వాధీనం చేసుకున్న గంజాయితో నర్సీపట్నం డీఎస్పీ మోహన్, సీఐ బి.హరి, సిబ్బంది

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 16: ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు తరలించేందుకు కృష్ణాదేవిపేటలో నిల్వ వుంచిన 207 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశామని నర్సీపట్నం డీఎస్పీ జీఆర్‌వీ మోహన్ తెలిపారు. దీనికి సంబంధించిన ఆయన తెలిపిన వివరాలిలా వున్నాయి. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి పార్కు సమీపంలో ముళ్ల పొదల్లో గంజాయి నిల్వ ఉన్నట్టు కృష్ణాదేవిపేట పోలీసులకు సమాచారం అందిందన్నారు. దీంతో మంగళవారం తెల్లవారుజామున నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి, కృష్ణాదేవిపేట, మాకవరపాలెం ఎస్ఐలు ఉపేంద్ర, రామకృష్ణ తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం డౌనూరు గ్రామానికి చెందిన కునేప సతీశ్, రోలుగుంట మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన బలిజి హరిబాబును గంజాయితో పట్టుకున్నట్టు తెలిపారు. వీరి నుంచి బైక్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని విశాఖపట్నం సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని, కేసు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు. గంజాయి కేసులో ప్రతిభ కనబరిచిన కృష్ణాదేవిపేట కానిస్టేబుళ్లు దుర్గాప్రసాద్, సతీశ్, చిరంజీవితో పాటు మాకవరపాలెం హెడ్‌కానిస్టేబుల్ శ్రీనుకు డీఎస్పీ మోహన్ నగదు ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి, కృష్ణాదేవిపేట, మాకవరపాలెం ఎస్ఐలు ఎం.ఉపేంద్ర, రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిది కిలోల గంజాయి స్వాధీనం

» ఇద్దరి అరెస్టు

చీడికాడ, ఏప్రిల్ 16: మండలంలోని వరహాపురం గ్రామ సమీపంలో పాడేరు ఏజెన్సీ గ్రామాల నుంచి చీడికాడ మీదుగా ఎనిమిది కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి చోడవరం కోర్టుకు తరలించామని ఎస్ఐ బి.నారాయణరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. వీరితో పాటు ఉన్న ఓ బాలుడిని జువైనల్ హోంకు తరలించామన్నారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. వాహనాల తనిఖీల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం వరహాపురం సమీపంలో తనతో పాటు తన సిబ్బంది తనిఖీ చేస్తుండగా హుకుంపేట గ్రామానికి చెందిన కొర్రా అనిల్‌కుమార్, విశాఖపట్నానికి చెందిన పల్లి రాజుతోపాటు మరో బాలుడు రెండు ద్విచక్ర వాహనాలపై గంజాయిని తరలిస్తున్నారన్నారు. వాహనాలు తనిఖీ చేయగా ఎనిమిది కిలోల గంజాయి బయటపడిందన్నారు. గంజాయి, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని మంగళవారం చోడవరం కోర్టుకి తరలించామని చెప్పారు. వీరితో పాటు ఉన్న బాలుడిని జువైనల్ హోంకు తరలించామని తెలిపారు.

పందూరులో మద్యం స్వాధీనం

కోటవురట్ల, ఏప్రిల్ 16: మండలంలోని పందూరులో బెల్టు షాపుపై దాడిచేసి 42 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రమణయ్య తెలిపారు. పందూరు గ్రామానికి చెందిన బత్తుల నాగవెంకట సన్యాసిశెట్టి తన ఇంటిలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్టు గుర్తుతెలియని వ్యక్తిఇచ్చిన సమాచారం మేరకు మంగళవారం దాడి చేశామన్నారు. 42 మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నామని, ప్రభుత్వ ధరల ప్రకారం వీటి విలువ సుమారు రూ.7 వేలు వుంటుందని ఎస్ఐ చెప్పారు. నిందితుడిపై కేసు నమోదుచేసి అరెస్టు చేశామని ఎస్ఐ రమణయ్య తెలిపారు.

35 ఎకరాల్లో సరుగుడు తోటలు దగ్ధం


దగ్ధమవుతున్న సరుగుడు తోటలు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 16: పెదమదీనాలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించి 35 ఎకరాల సరుగుడు తోట దగ్ధమైంది. కాల్చిపారేసిన సిగరెట్టు కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో నమ్మి శ్రీనుకి చెందిన ఆరు ఎకరాలు, గడందాసు సత్తిబాబు 10, మల్లారపు గంగరాజు 2, దంద్రు గోవింద 1, రమణ 1, నూకరాజు 2, రాబడి 2, దాలిబోయిన కొండబాబు 1, మల్లారపు కేదారి 1, నారాజు 1, వెంకటస్వామికి చెందిన ఎకరంతో పాటు తదితరులకు చెందిన సరుగుడు తోటలు దగ్ధం కావడంతో బాధిత రైతులు విలపిస్తున్నారు. అనకాపల్లి, చోడవరం అగ్నిమాపక కేంద్రాల సిబ్బంది మంటలను అదుపు చేశారు.

కుసర్లపూడి, బుచ్చెంపేటలో..

రోలుగుంట: మండలంలోని బుచ్చెంపేటలో మంగళవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన చిటికెల రాజుబాబు, రెడ్డి రామయ్యమ్మ, గాలి సోమన్నమ్మ, గాలి నూకరాజులకు చెందిన మూడు ఎకరాల యూకలిప్టస్, టేకు తోటలు దగ్ధమయ్యాయి. అలాగే కుసర్లపూడిలో చుక్కా సత్తిబాబుకు చెందిన రెండు ఎకరాల జీడిమామిడి తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. నర్సీపట్నం అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు.

వ్యాపారిపై చీటింగ్ కేసు నమోదు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16: ఒక ప్రముఖ కంపెనీ పేరుతో నకిలీ గ్యాస్ స్టౌలను విక్రయిస్తున్న వ్యాపారిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ అలీ తెలిపారు. ఆయన వెల్లడించని వివరాల ప్రకారం... స్థానిక చిన్నవీధిలోని ఒక దుకాణంలో బట్టర్ ఫ్లై కంపెనీకి చెందిన దినేశ్ శివరామ్‌శెట్టితో పాటు మరొకరు 15 రోజుల క్రితం రెండు గ్యాస్ స్టౌలు కొనుగోలు చేశారు. వీటిని ముంబైకిలోని కంపెనీకి పంపించి పరిశీలన చేయించగా నకిలీవని నిర్ధారణ అయింది. దీంతో దినేశ్‌శివరామ్‌శెట్టి ఫిర్యాదు మేరకు దుకాణ ప్రతినిధిపై చీటింగ్ కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 16: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

బెంగళూరు-మల్దా-బెంగళూరు

06565 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి జూన్ 26 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 4.35 గంటలకు బెంగళూరులో బయలుదేరి మర్నాడు ఉదయం 9.56 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 7.30 గంటలకు మల్దా చేరుతుంది. తిరిగి ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం ఉదయం 8.50 గంటలకు మల్దాలో బయలుదేరి మర్నాడు ఉదయం 5.40 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 3.00 గంటలకు బెంగళూరు చేరుతుంది.

సికింద్రాబాద్-సంత్రాగచ్చి-సికింద్రాబాద్

07221 నంబరు గల రైలు ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి మంగళ, శనివారం ఉదయం 6.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 7.55 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 10.25 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది. తిరిగి ఈనెల 22 నుంచి జూన్ 30 వరకు ప్రతి బుధ, ఆదివారం మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 3.20 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 3.00 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	108.00
లైవ్ ధర	128.00
విత్ స్కిన్	226.00
స్కిన్ లెస్	236.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

గ్రామాన్ని తరలిస్తేనే ఎన్నికల్లో పాల్గొంటాం

» పెందుర్తి ఆర్‌ఓకు తేల్చి చెప్పిన తాడి గ్రామస్థులు



తాడి గ్రామస్థులతో సమావేశమైన పెందుర్తి ఆర్‌వో శేషశైలజ

పరవాడ, ఏప్రిల్ 16: వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించే విషయంలో తాము వెనక్కు తగ్గేది లేదని మండలంలోని తాడి గ్రామస్థులు పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిట్నరింగ్ అధికారిణి శేషశైలజకు తేల్చి చెప్పారు. ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తమ గ్రామాన్ని తరలించడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, ఇందుకు నిరసనగా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు తాడి గ్రామస్థులు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం తాడి గ్రామంలో ఆమె 'సీప్' సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలుష్య సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని, సార్వత్రిక ఎన్నికలకు సహకరించాలని కోరారు. దీంతో పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ, తమ సమస్యను గతంలోనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని, మీరు మరోసారి తీసుకువెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామాన్ని తరలిస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే ఎన్నికల్లో పాల్గొంటామని స్పష్టం చేశారు. రిట్నరింగ్ అధికారిణి శేషశైలజ ప్రతిస్పందిస్తూ.. గ్రామ తరలింపునకు ఎలాంటి హామీ ఇవ్వలేనని, మరోసారి ఆలోచించుకుని ఎన్నికల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మాదం శెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, నాయకులు కోమటి అచ్చిబాబు, కోమటి సూరిబాబు, గనిరెడ్డి కనకారావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ బాలసూర్యారావు, తహసీల్దార్ గణపతిరావు, ఎంపీడీవో కీర్తిస్పందన, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్యంతో పలు రకాల సమస్యలు

» మూలస్వయంభూవరం గ్రామాన్ని తరలించాల్సిందే


నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

పరవాడ, ఏప్రిల్ 16: సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్యం బారిన పడిన తమ గ్రామాన్ని తరలించాలని మూలస్వయంభూవరం ప్రజలు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఎన్టీపీసీ నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి కారణంగా రోగాలబారిన పడుతున్నామన్నారు. నీటి వనరులు కలుషితమయ్యాయని, తాగునీటిని కొనుక్కోవాల్సి వస్తున్నదని, పంటలు పాడైపోతున్నాయని, పశువులు మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పలువురు ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, నేత్ర సంబంధ సమస్యలతో బాధపడుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి బాబురావు, భానుప్రసాద్, కె.లక్ష్మి, అప్పలనాయుడు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కూటమి అభ్యర్థుల గెలుపునకు సహకరించండి

» బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ వినతి

» యాదవ సామాజిక వర్గీయులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి సహకరించాలని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కోరారు. మంగళవారం కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో యాదవ సామాజిక వర్గీయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటు అభివృద్ధి పనులు, అటు సంక్షేమ పథకాలకు సమాన ప్రాధాన్యం ఇస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ఇందుకు కూటమి కట్టుబడి వుందని అన్నారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, ఎన్నికల అనంతరం రాష్ట్రంతోపాటు కేంద్రంలో కూడా ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. యాదవ సామాజిక వర్గీయులంతా కూటమి అభ్యర్థుల గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు భరణికాన బాబురావు, భరణికాన నరసింహమూర్తి, సబ్బి శ్రీనివాసరావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సరకులన్నీ ఒకేసారి పంపిణీ చేయాలి

» వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న నాగశేషు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16: అంగన్‌వాడీ కేంద్రాలకు సరకులకు సకాలంలో, సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన టేక్ హోమ్ రేషన్‌కు సంబంధించి అన్ని రకాల సరకులను ఒకేసారి కేంద్రాలకు పంపిణీ చేయడం లేదని, లబ్ధిదారులకు అన్ని సరకులు ఒకేసారి ఇస్తేనే ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో నమోదు అవుతుందని చెప్పారు. కానీ సరకులు ఇవ్వకుండానే.. ఇచ్చినట్టుగా యాప్‌లో నమోదు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. టీచర్, ఆయాలు ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కేంద్రంలోనే ఉండాలన్న అధికారుల ఆదేశాలపై ఆందోళన నిర్వహిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి వివిధ యాప్‌లను ఒకే యాప్‌గా మారుస్తామని సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, సభ్యులు వీవీ రమణమ్మ, కె.రామలక్ష్మి, తనూజ, ఉమా నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో యువతకు అన్యాయం

» టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టాభిరామ్



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టాభి, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఏప్రిల్ 16: వైసీపీ పాలనలో యువతకు అన్యాయం జరిగిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.పట్టాభిరామ్ అన్నారు. మంగళవారం బలిఘట్టంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ శక్తి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాదయాత్రలో యువతకు జగన్మోహన్‌రెడ్డి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశారన్నారు. ఉత్తరాంధ్రను గంజాయి, డ్రగ్స్‌కి అడ్డాగా మార్చేశారని విమర్శించారు. గత ఎన్నికలకు ముందు కోడి కత్తి డ్రామా ఆడాడని, ఓడిపోవడం ఖాయమని తెలుసుకొని సానుభూతి కోసం ఇప్పుడు గులకరాయి డ్రామా ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇక్కడున్న పిల్ల సైకో నర్సీపట్నంలో ఏ అభివృద్ధి చేశాడో చెప్పాలని ఎమ్మెల్యే గణేశ్‌ను ఉద్దేశించి అన్నారు. అయ్యన్నపాత్రుడు తీసుకొచ్చిన ఏరియా ఆస్పత్రి అంటే డెలివరీ కేసులు చేయడంలో రాష్ట్రంలోనే మంచి పేరు ఉండేదని, ఇప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతే టార్చ్‌లైట్లు వేసుకొని ఆపరేషన్లు చేస్తున్నారని అన్నారు. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ మాట్లాడుతూ కేంద్రంలో తనకున్న పరిచయాలతో పరిశ్రమలు తీసుకొచ్చి ఈ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. ఉద్యోగ అవకాశాలు కల్పించే ముఖ్యమంత్రి కావాలా ? యువతను డ్రగ్స్‌కి అలవాటు చేసే ముఖ్యమంత్రి కావాలా? అని ప్రశ్నించారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ వంగవీటి రంగా దేనికి ఆశించకుండా బడుగు బలహీన వర్గాల కోసం పని చేశారని తెలిపారు. బతికున్నప్పుడు చేసిన మంచి పనులే చనిపోయిన తరువాత ప్రజలు గుర్తుంచుకుంటారన్న దానికి నిదర్శనంగా రాష్ట్ర వ్యాప్తంగా వంగవీటి రంగా విగ్రహాలు కనిపిస్తాయని చెప్పారు. అంతకు ముందు వంగవీటి రంగా తనయుడు రాధా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, పచ్చా విజయ్, బండారు వంశీకృష్ణ, జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాపులంతా కూటమి వైపు నిలబడాలి

» కాపు జేఏసీ సభ్యులు ఆరేటి ప్రకాశ్


సంఘీభావం తెలుపుతున్న కాపు సంఘాల జేఏసీ ప్రతినిధులు

విశాఖపట్నం, ఏప్రిల్ 16: అన్ని విధాలా వంచించిన వైసీపీ వైపు కాకుండా, కాపులంతా ఈ ఎన్నికల్లో కూటమి వైపు నిలబడాలని కాపు జేఏసీ సభ్యులు ఆరేటి ప్రకాశ్, కాపు ఉద్యమ నేత ఆకుల రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాపునేతలంతా కూటమి అభ్యర్థులకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ 5 శాతం అమలుకాక, కాపు విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కాపులకు సబ్సిడీ రుణాలు ఇవ్వలేదన్నారు. ఈస్థితిలో రాష్ట్రం బాగుండాలంటే దూరదృష్టి ఉన్న చంద్రబాబు వల్లే సాధ్యమన్నారు. జగన్మోహన్ రెడ్డి కాపులకు తీరని అన్యాయం చేశారన్నారు. ఎక్కువగా కౌలు రైతుల ఉన్న కాపు కులాన్ని అణగదొక్కారన్నారు. తమ సామాజిక వర్గం అన్ని రంగాల్లో వెనకబడిపోయిందన్నారు. కూటమి ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. గతంలో పోరాడి కాపు కార్పొరేషన్ సాధించుకుని ఎన్నో ప్రయోజనాల పొందామన్నారు. ఈడబ్ల్యూసీలో 5 శాతం రిజర్వేషన్ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చంద్రబాబుతోనే సాధ్యమైందన్నారు. పోరాడి సాధించుకున్న ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ వైసీపీ పూర్తిగా అమలు చేయక విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరమయ్యారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 500 పైగా కాపు భవనాలను నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీకి చెందిందన్నారు. విదేశీ విద్యను మూడేళ్లుగా పరిగణనలోకి తీసుకోకుండా మోసం చేశారన్నారు. ఈస్థితిలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన వారంతా వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. రాజధాని, పోలవరం ప్రాజెక్టు పూర్తిగా నాశనం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల సత్యారావు, ప్రగడచిన నాగేశ్వరరావు, కర్రి వెంకటరమణ, సిరిసిపల్లి రమణ, మార్కినీడు మణికంఠ, అన్నం వెంకటరావు, తోట రామానుజం, గొల్లకోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వూషూ రిఫరీగా మౌనిక ఎంపిక


సర్టిఫికెట్ అందుకుంటున్న మౌనిక

నర్సీపట్నం, ఏప్రిల్ 16: రాష్ట్ర స్థాయిలో వూషూ రిఫరీగా మౌనిక అర్హత సాధించింది. ఈ నెల 13 నుంచి 15 వరకు సింహాచలంలోని ఇండోర్ హాల్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి రిఫరీ, జడ్జి సెలక్షన్స్ నిర్వహించారు. ఇందులో వూషూ కోచ్‌గా వ్యవహిస్తున్న వేపాడ మౌనిక సర్టిఫికెట్ సాధించి వూషూ రిఫరీగా అర్హత సాధించింది.

ఉపాధి పనుల్లో మహిళకు అస్వస్థత


ఉపాధి పనులు చేస్తుండగా అస్వస్థతకు గురైన చిన్నమ్మలు

గొలుగొండ, ఏప్రిల్ 16: మండలంలో ఉపాధి పనులు చేస్తుండగా ఎండ తీవ్రతకు జోగంపేట గ్రామానికి చెందిన చిటికెల చిన్నమ్మలు అస్వస్థతకు గురైంది. మండలంలో మంగళవారం ఉదయం జోగంపేట గ్రామ పంచాయతీకి చెందిన ఉపాధి కూలీలు గర్సింగి అటవీ ప్రాంతంలో జీడి మామిడి తోటల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. పనులు నిర్వహిస్తుండగా చిటికెల చిన్నమ్మలు వడదెబ్బకు ఒక్కసారిగా కిందపడిపోయినట్టు సహచర కూలీలు తెలిపారు. ఆమెను గొలుగొండ పీహెచ్‌సీకి తరలించారు. వైద్యం అందించిన అనంతరం ఆమె కోలుకుంది. ఉపాధి పనులు నిర్వహించే ప్రదేశంలో టెంటు ఏర్పాటు చేయాలని అధికారులను కూలీలు కోరుతున్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను కలిసిన వంగవీటి రాధ


బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌తో మాట్లాడుతున్న వంగవీటి రాధ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16: అనకాపల్లి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేశ్‌ను వంగవీటి రంగ తనయుడు వంగవీటి రాధ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సాయంత్రం స్థానిక జాతీయ రహదారి పక్కనున్న బీజేపీ కార్యాలయానికి వచ్చిన వంగవీటి రాధకు, బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన సీఎం రమేశ్‌ను కలిసి పలు విషయాలపై మాట్లాడారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ


శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

మాడుగుల, ఏప్రిల్ 16: ఎన్నికల విధులకు సంబంధించి మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జీవీ సత్యవాణి ఆధ్వర్యంలో సిబ్బందికి మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. 252 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సందర్శించారు. శిక్షణ తరగతులపై ఆర్‌వో నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి.సత్యనారాయణ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.రాజా, సీనియర్ అసిస్టెంట్ వి.పూర్ణయ్య, ఈవోపీఆర్‌డీ మీనా కుమారి, ఆర్ఐ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు

» ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశం

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 16: చెక్‌పోస్టులు, డైనమిక్ చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు చేయాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నెల వారి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం, ఉచిత కానుకల రవాణాకు అడ్డు కట్టవేయాలన్నారు. రాజకీయ నాయకుల ఎన్నికల బహిరంగ సభల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఎన్నికల నియమావళి ప్రకారం బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, అభ్యర్థులకు సంబంధించి మూడు వాహనాలు మాత్రమే నామినేషన్ సమయంలో రిటర్నింగ్ కార్యాలయానికి అనుమతించాలన్నారు. అభ్యర్థితో సహా ఐదుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి చాంబర్‌లోకి అనుమతించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ విజయభాస్కర్, డీఎస్పీ సత్యనారాయణ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వెన్నెలపాలెంలో పట్టపగలు చోరీ

» 8.25 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

పరవాడ, ఏప్రిల్ 16: మండలంలోని వెన్నెలపాలెం పంచాయతీ బీసీ కాలనీలో మంగళవారం పట్టపగలు దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ప్రవేశించి బీరువాలో ఉన్న 8.25 తులాల బంగారం ఆభరణాలు ఎత్తుకెళ్లిపోయారు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీసీ కాలనీకి చెందిన చుక్క రమాదేవి, అత్త పైడమ్మతో కలిసి నివాసం ఉంటున్నారు. పైడమ్మ ఉదయాన్నే బజారుకు వెళ్లిపోగా రమాదేవి ఎన్టీపీసీలో కూలీ పనికి వెళ్లింది. పైడమ్మ మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లోని బీరువా తెరిచి వుంది. ఇందులో భద్రపరిచిన 8.25 తులాల బంగారం ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించింది.విషయాన్ని రమాదేవికి ఫోన్ ద్వారా తెలియజేసింది. సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీమ్ వచ్చి వివరాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.